# మున్నేరులో జడలు విప్పిన
# ఇసుక మాఫియా



**చింతకాని, ముదిగొండ, కెరటం న్యూస్**

చింతకాని, ముదిగొండ మండలాల గుండా ప్రవహిస్తున్న మున్నేరు కొందరు అక్రమార్కులకు కాసులు కురిపిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తరచుగా వచ్చే వరదల కారణంగా సహజంగా లభించే ఇసుకను ఈ రెండు మండలాలకు చెందిన కొందరు తమ పట్టా భూమి అంటూ వారే స్వయంగా ర్యాంపులు ఏర్పాటు చేసి అనధికారిక ట్యాక్స్ వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు మండల తహసీల్దార్లతో పాటు జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా ఈ రెండు ప్రాంతాల్లోని కొందరు వ్యక్తులు తమ రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని పెద్ద పెద్ద నాయకులు తమ వెంటే ఉన్నారంటూ ఒక పక్క అధికారులను, మరో పక్క ప్రజలను తప్పుదారి పట్టిస్తూ నిత్యం రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్టు అధికారులకు ఫిర్యాదులు అందుతూ ఉన్నాయి. ఈ తంతు గత పదేండ్లనుండి యధేచ్చగా జరుగుతున్నా..ఈ క్రమంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై ఎన్నిసార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు చేసి పట్టుకున్నా, కేసులు పెట్టినా అప్పనంగా సహజ వనరులపై వస్తున్న ఆదాయానికి రుచి మరిగి స్థానికులు మాత్రం పట్టా భూములంటూ వసూళ్ల పర్వం కొనసాగిస్తూనే ఉన్నారు. వందలాది ట్రాక్టర్లతో నిత్యం ఇందిరమ్మ ఇండ్లకు సరఫరా చేసే పేరుతో ఖమ్మంతో పాటు, అటు ఏపీలోని వివిధ ప్రాంతాలకు ఈ రెండు ప్రాంతాలనుండి ఇసుకను రవాణా చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**మీరైనా స్పందిచండి.. తహసిల్దార్‌కు ఎమ్మార్పీఎస్ వినతి పత్రం**

ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ముదిగొండ మండలం, చింతకాని మండలం చిన్నమండవ శివారు ప్రాంతంలో పట్టా భూమి అని చెబుతూ అక్రమ వసూలు చేస్తున్న పట్టా పాస్ బుక్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తాసిల్దార్ కరుణాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కూపన్ లు రూ.200 రూపాయలకి మంజూరు చేస్తుంటే ఇదే అదునుగా భావించి ఒక్కొక్క ట్రాక్టర్ కి రూ.1000 వసూలు చేస్తున్నారు, ఇలా ప్రతిరోజు మూడు లక్షలకు పైగా అక్రమంగా వసూలు చేస్తున్నారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సీన్ రేజి చార్జిలు వసూలు చేయడం వలన అధిక భారం పేదవాళ్లకి భారం పడుతుందని తహసీల్దార్‌కు తెలిపారు. ఈ ఇసుక అక్రమ వసూలు ఆపాలని, పంట పొలానికి కాకుండా మున్నేరులో ఇచ్చినటువంటి పట్టా పాస్ పుస్తకాలను రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చిర్ర ఉపేందర్, గుండ్ల రాంబాబు, చాట్ల రాజేష్, బోనకల్ మండలం ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షులు అశోక్ మరియు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**మున్నేరులో పట్టాలు రద్దు చేయాలి...**

చింతకాని, మండలం చిన్నమండవ నుండి ఇందిరమ్మ ఇండ్లకు అధికారులు జారీ చేసిన ఇసుక కూపన్లతో ఇసుకను తెచ్చుకునేందుకు వెళ్లిన ట్రాక్టర్ల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న దళారులపై అధికారులు చర్యలు తీసుకోకుండా మౌనం పాటించడాన్ని బట్టి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన ఇసుక అక్రమ రవాణా కొందరు స్థానికులు వసూలు చేస్తున్న ట్యాక్స్ చెల్లించి వేలాది రూపాయలకు ఖమ్మం, తదితర ప్రాంతాల్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని తహసీల్దార్‌కు నేరుగా సమాచారం అందించారు. కండ్ల ముందే ఇంత అక్రమం జరుగుతున్నా, స్థానిక మండల అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని అన్నారు. ఒక విధంగా అధికారుల కన్నుసన్నలలోనే ఈ అక్రమాలు జరుగుతున్నట్లు మండలంలో బలంగా ఆరోపణలు వస్తున్న క్రమంలో త్వరలోనే జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగానే ఇసుకను అందించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అక్రమార్కులు గండికొడుతున్నట్టు పెద్ద ఎత్తున వాట్సాప్, సోషల్ మీడియా గ్రూపుల్లో ఫొటోలు, వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఏండ్ల తరబడి కండ్ల ముందే జరుగుతున్న ఈ అక్రమాన్ని అరికట్టేందుకు మున్నేరులో పట్టాలు రద్దు చేయాలని, విచారణ జరిపి ప్రభుత్వ భూములను గుర్తించి ర్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.